

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 21 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

కృష్ణరాయల మహలు రాత్రిని జయించిన వేకువలా ఉన్నది చుట్టూ వెలుగుతున్న చమురుదీపాల కాంతులలో. అక్కడక్కడా ఉన్న అందమైన గాజు దీపాలు మరింత కాంతిని పారిస్తున్నాయి. కోటబురుజులమీద కదులుతున్న కావలివాళ్ళ నీడలు కూడా స్పష్టంగా కనిపించే కాంతి. గంభీరంగా కూర్చుని ఉన్న సమర్ధరాముని చుట్టూ పరివేష్టించి ఉన్నారు శిష్యులు. కొద్దిగా ఎడముగా ఆసనం మీదకూర్చుని ఉన్నాడు కృష్ణరాయలు. ఆయన ముఖంలో ఒకవిధమైన నైరాశ్యం, ఆందోళన, బాధ అన్నీ కలగలిసి నీడల్లా కదులుతున్నాయి. కొద్దిగా దూరంగా నేలమీద రక్తపు చారికలతో, మెడవిరిగి పడిఉన్న కళేబరం.

'నేనెవరితోనూ శతృత్వాన్ని మూటగట్టుకోలేదు స్వామీ! ఎందుకిలా? ఎవరికి పగ నామీద?' మౌనాన్ని భగ్నం చేస్తూ అన్నాడు. సమర్ధరాముడు మాట్లాడలేదు. ఆయన నిశితంగా చుట్టూ కలయజూస్తూ ఉన్నాడు.

మున్నేటి తీరంలో దాడి తరువాత తన స్నానం, సాయంసంధ్య ముగించుకుని వచ్చాడు ఆయన. అంతకు ముందే చేరుకున్నాడు కృష్ణరాయలు. యథావిధిగా రఘువీరుని సాలగ్రామ విగ్రహాలకు సాయంకాలపు సేవ, కీర్తన ముగిసింది. ఆందోళన చెందుతున్న కృష్ణరాయల సతీమణి లక్ష్మీబాయిని ధైర్యపరచి, భోజనాదికాలు ముగించినతరువాత సమావేశాన్ని ఏర్పాటుచేశాడు సమర్ధరాముడు.

గత సంవత్సరం గ్రామం మీద పిండారీలు దాడి చేసిన దగ్గరినుండీ కృష్ణరాయల కోటలో యాభైమంది సైనికులు స్థానికంగా వుంటున్నారు. ఎనిమిదిమంది ఆయన అంగరక్షకులు. సహజంగా నలుగురు మహలును కనిపెట్టుకుని ఉంటారు. నలుగురు ఆయనతో మామూలు సందర్భాలలో వెన్నంటి ఉంటారు. ఆ నలుగురిలో యిద్దరిని బలి తీసుకున్నది ఈ సాయంకాలం ఆయనమీద జరిగిన దాడి. ఉద్దండులు వారు. ఈరోజెందుకో వారికి కలిసిరాలేదు అనిపించింది కృష్ణరాయలకు. విసురుగా ప్రక్కనున్న గండశిలమీదికి పడిపోవడంతో

తల బ్రద్దలై ఒక వీరుడు మరణించాడు. మరొకడు కృష్ణరాయలకు కవచంగా మారి, బాణం దెబ్బకు ఒరిగిపోయాడు.

ముందు ఆయన అంగరక్షకులలో మిగిలిన ఆరుగురితో మాట్లాడి, వారికి కొన్ని సూచనలు చేసి పంపించాడు సమర్ధరాముడు. తరువాత కోటలోఉండే మిగిలిన సిపాయీలతో మాట్లాడి పంపించాడు. యిప్పుడు ఆయన, శిష్యులు, కృష్ణరాయలు మాత్రమే ఉన్నారు.

'నీ మిత్రుల శత్రువులూ నీ శత్రువులే క్రిష్ణాబా! నీమీద తుపాకీని ప్రయోగించింది ఎవరో ఊహించావా?' అని అడిగాడు కృష్ణరాయలను.

'ఊహించాను కానీ..' అని ఆగిపోయాడు. మళ్ళీ 'ఇబ్రహీం మనిషి అనుకుంటున్నాను' అన్నాడు కృష్ణరాయలు. చిరునవ్వుతో అవునన్నట్టు తలపంకించాడు సమర్ధుడు.

'నామీదకు వచ్చింది..?' ప్రశ్నార్ధకంగా అడిగాడు సమర్ధుడు మళ్ళీ.

కృష్ణరాయలు మౌనం వహించాడు. ఆయనకు తెలుసు. తనకు తెలుసునోలేదో వినోదంగా పరీక్షిస్తున్నాడు. ఆ వినోదంగా పరీక్షించడంకూడా తన మనసులో బరువును తేలిక చేయడానికి, వీరుల జీవితాలలో యివన్నీ మామూలే అని చెప్పడానికి. అన్నీ తెలిసిన మహానుభావుడు. మనుషులను మనసులను వశపరుచుకుని కార్యాన్ని ఎలా సాధించాలో ఆయనకన్నా మిన్నగా తెలిసినవారు ఎవరూ లేరు, ఒక్క విశ్వామిత్రుడు తప్ప! ఇలాంటి శక్తి ప్రేరేపిస్తున్నపుడు శివాజీలు ఎందుకు ఉద్భవించరు? అనుకున్నాడు లోలోపల.

'మల్లప్ప! తను వచ్చే సాహసం లేక, గోల్కొండ బానిసలను పంపాడు' అన్నాడు సమర్ధరాముడు కొద్దిగా దూరంగా నేలమీద పడి ఉన్న శవాన్ని చూస్తూ. నేలమీద పడిఉన్న ఆకారం మూడున్నర బారల పొడవు ఉన్నది. నల్లగా యినుప స్థంభంలా ఉన్నాడు వాడు. వాడు చచ్చి కొన్ని గంటలు అయినా నూనె పూసినట్టు వాడి శరీరం మెరుస్తూనే ఉన్నది. నెత్తిమీద జుత్తు ఎక్కువగా లేదు. సహజంగా గోల్కొండ అంతఃపురాలకు కావలి కాసే నల్లజాతి బానిసల దళంలో వాడు వీడు. ఉత్త చేతులతో ఎనుబోతులను మట్టిగరిపించే క్రీడలు వాళ్ళ వ్యాయామ క్రీడలు. అంతటి బలమైన వాడి మెడను ఎండుపుల్లను విరిచినట్టు విరిచిపారేసి మాయమయ్యిందట విచిత్రంగా ప్రత్యక్షమైన కొండముచ్చు. అదెంత బలం కలిగి ఉన్నదో అనుకున్నాడు విరిగిన మెడనుండి బయటకు తెల్లని దిమ్మలా పొడుచుకువచ్చిన ఎముకను చూస్తూ. మౌనంగా చిరునవ్వులు చిందిస్తూ కృష్ణరాయల ముఖాన్ని పరికిస్తున్నాడు సమర్ధ రాముడు. రంగులు మారుతున్న ఆ వదనం వెనుకనున్న భావాలను అద్దంగుండా చూసినట్టు చదువుతున్నాడు. ఆయన చేసిన సంజ్ఞను గ్రహించి ఆ కళేబరాన్ని తొలిగించి, ఖననానికి తీసుకెళ్ళారు నలుగురు సిపాయీలు. వాడి చరిత్ర ముగిసింది.

'మాధోబా ఎదుగుదలతోపాటు, ఆతని వ్యవహార శైలి శత్రువులను పెంచడమే కాక, వారిని ఒక్కటి చేసింది కృష్ణాబా! '

'గోల్కొండ సామ్రాజ్యాన్ని అంతవరకూ శాసిస్తున్న శక్తులకు మాధోబా అడ్డుపడ్డాడు. యిప్పుడు పెత్తనం అంతా అక్కన్న మాదన్నలే చేస్తున్నారని ఇబ్రహీం, వాడి అనుచరులు, జనానాలోని కొందరు ఒక్కటయ్యారు. దక్షిణివారిని తనకు తొత్తులుగా చేసుకుని వారి నజరానాలు, ఖితాబులు, గుత్తాలు, మణిమాణిక్యాలు వెనకేసుకుంటున్నాడు అని మల్లప్పకు మంట!' మౌనంగా వింటున్నాడు కృష్ణరాయలు. సర్వాంతర్యామికి ఎన్ని తెలుసో అన్ని ఈయనకూ తెలుసు అనుకున్నాడు. అలా అనుకోవడం ఈ మూడు రోజులనుండీ అది ఎన్నోసారో, లెక్క లేదు.

'ఒక్కొక్క మెట్టు ఎక్కినకొద్దీ నేలకు దూరమైపోతాము కృష్ణబా! నేలమీద ఉంటేనే ఎక్కువ రక్షణ, ఆకాశంలో కన్నా! నేలను మరిచిపోకూడదు. ఎత్తులకు ఎదిగినకొద్దీ పడిపోవడం జరిగితే వాటిల్లే ప్రమాదంలో తీవ్రత పెరుగుతుంది.'

' గోల్కొండలో పరస్పరం మిత్రులు అన్నదమ్ములిద్దరే. బయటి బలవంతుడైన మిత్రుడివి నువ్వు. నీకారణంగా నేను, నా కారణంగా ఛత్రపతి, ఆ కారణంగా బలపడుతున్న హైందవ సామ్రాజ్యం. ఛత్రపతి రాకను ఆపుజేసే ప్రయత్నాలలో యివి భాగాలు కృష్ణాబా!' గంభీరంగా పలికాడు సమర్ధుడు.

'యింతటితో ఈ ప్రయత్నాలు ఆగుతాయా? అలా అనిపించడంలేదు స్వామీ' అన్నాడు కృష్ణరాయలు. యిప్పుడు అయన మాటల్లో, శరీర భాషలో ఒక నిశ్చయానికి వచ్చిన ధోరణి కనిపిస్తున్నది. దెబ్బకుదెబ్బ తీయడానికి సిద్ధం కావాలనే తెగింపు కనిపిస్తున్నది.

చిరునవ్వు నవ్వాడు సమర్ధుడు. ' యివి ఇప్పుడిప్పుడే ఆగవు. కానీ విరామం ఉంది. ఒక చివరి యత్నం ఉంటుంది. ఇంతకన్నా బలంగా ఉంటుంది. అలా అయినా ఛత్రపతి రాక ఆగితే చాలు అని ఆశ' సాలోచనగా పలికి చిన్నగా నవ్వాడు సమర్ధుడు. ' యిన్నీ చేసిన రఘువీరుడే యింకా అన్నీ చేస్తాడు. యిదంతా మనమా చేసింది! విశ్రాంతి తీసుకో కృష్ణబా! రేపు సేవకు స్థంభాద్రి నృసింహుడు పిలుస్తున్నాడు' అన్నాడు.

'అలాగే స్వామీ! ఏర్పాట్లు జరుగుతాయి' అని నమస్కరించి మహలులోకి వెళ్ళిపోయాడు కృష్ణరాయలు. ఉద్ధవుడిని, కళ్యాణ్ స్వామిని, చిన్నగోవిందుడిని, వీరభద్రుడినీ పిలిచి కొంతసేపు లోగొంతుకతో చర్చించి వారిని పంపి తను విశ్రమించాడు సమర్ధుడు. నలుగురూ కోట నాలుగు మూలలకు తమ ఆయుధాలను తీసుకుని నిష్క్రమించారు. 'జయజయ రఘువీర సమర్థా!' అని నినదించి మౌనం వహించాడు సమర్ధరాముడు. ప్రశాంతంగా నిద్రలోకి జారుకున్నాడు.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS